క్లుప్తంగా

రేపటి నుంచి నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలు



క్రోసూరు: మండలంలో మూగజీవాలకు నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలంలో మూగజీవాల్లో(గొర్రెల్లో) నీలి నాలుక వ్యాధి ఇబ్బంది పెడుతుందన్నారు. వర్షాలకు ఈ వ్యాధి మరిన్ని జీవాలకు వ్యాప్తి చెందుతుందన్నారు. వైరస్ కారణంగా ఈ వ్యాధి ఏడాదిలో ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్ మాసాల్లో అధికంగా వస్తుందని తెలిపారు. ఈ సమయంలో మూగజీవాల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. సోమవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం ఈ టీకాలు వేయనున్నట్లు వివరించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాథ, వృద్ధుల ఆశ్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సందేపోగు రాజారావు భార్య సుజాత జయంతి సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. సుజాత కుమార్తె స్వప్న ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు సురేష్, మురారి గిరి తేజ, ఆశ్రమ నిర్వాహకులు రిషిత, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి



సత్తెనపల్లి: సీజనల్ వ్యాధుల విషయంలో అవగాహన పెంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ధర్మ సింగ్ శాస్త్రి అన్నారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ డీఈ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో చికిత్స అందించకపోతే ఒక్కోసారి ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందన్నారు. డాక్టర్ ఎండీ ఆసియా, డాక్టర్ భాను ప్రకాష్, మండల విద్యాశాఖ అధికారులు ఏ శ్రీనివాసరావు, ఏ రాఘవేంద్రరావు, అధికారులు కె.సాగర్, ప్రమీల, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పు అంతిమం



సత్తెనపల్లి: లోక్ అదాలత్‌లో ఇచ్చే అవార్డు (తీర్పు) అంతిమ తీర్పు అని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా సత్తెనపల్లిలో ఉన్న నాలుగు న్యాయస్థానాల పరిధిలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. పలు కేసులు పరిష్కరించారు. మొత్తం మూడు బెంచ్‌లుగా నిర్వహించారు. మొదటి బెంచ్‌కు న్యాయమూర్తిగా సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాస రావు, లోక్ అదాలత్ మెంబర్‌గా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు వ్యవహరించారు. రెండో బెంచ్‌కు న్యాయమూర్తిగా సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, మెంబర్‌గా న్యాయవాది బి.ఎల్.లక్ష్మీ కోటేశ్వరరావు... మూడో బెంచ్‌కు న్యాయమూర్తిగా సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్, మెంబర్‌గా న్యాయవాది గంటా వెంకట శివ వ్యవహరించారు. మొత్తం 122 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

ముప్పాళ్ళ: అర్హులైన కౌలు రైతులు పంట సాగు హక్కుపత్రం (కౌలు రైతు కార్డు) పొందేందుకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ పీ సింగారావు శనివారం తెలిపారు. సాగు చేసిన భూమి యజమాని అంగీకారంతో కార్డు మంజూరు చేస్తామన్నారు. గ్రామ సచివాలయంలోని వీఆర్వోకు దరఖాస్తు అందించాలని కోరారు. మండలంలో ఈ ఏడాదికి 2,009 కార్డులు మంజూరు లక్ష్యం కాగా ఇప్పటికి 330 మందికి అందించామన్నారు.

పింఛన్ల పంపిణీకి కసరత్తు

- సచివాలయ సిబ్బందికి బాధ్యతలు
- వివిధ విభాగాల ఉద్యోగుల భాగస్వామ్యం
- వచ్చే నెల 1న ఇంటింటికీ వెళ్లి అందజేత
- నియోజకవర్గంలో 40,168 మంది లబ్ధిదారులు



వృద్ధురాలికి పింఛన్ పంపిణీకీ బయో మెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ దివ్య (ఫైల్)

నియోజకవర్గంలో పింఛన్‌దారులు, వారికిచ్చే నగదు ఇలా..

మండలం	సచివాలయాలు	పెన్షన్‌లు	నగదు
సత్తెనపల్లి టౌన్	15	6,329	4,32,84,500
సత్తెనపల్లి రూరల్	19	10,905	7,41,56,500
ముప్పాళ్ళ	13	6,240	4,22,55,000
రాజుపాలెం	14	7,065	4,80,43,500
నకరికల్లు	14	9,629	6,51,00,000
మొత్తం	75	40,168	27,28,39,500

సత్తెనపల్లి: వచ్చే నెల 1వ తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం పెద్ద 'కసరత్తే' చేస్తోంది. గతంలో వలంటీర్లే నేరుగా ఇంటింటికీ వెళ్లి తమ పరిధిలోని 50 ఇళ్ల లబ్ధిదారులకు ఒకటో తేదీనే పింఛన్ మొత్తాన్ని అందించేవారు. ఇప్పుడు ఆ పనికి సచివాలయ సిబ్బందితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాల్సి వస్తోంది. వీలైనంత వరకు ఒకటో తేదీనే పంపిణీ పూర్తి చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గంలో 40,168 మంది వివిధ పింఛన్‌దారులు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 75 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. 653 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్లస్టర్ విధానం అనుసరించి ఒక్కొక్కరికి 50 పింఛన్లు దాటకుండా సిబ్బందిని మ్యాపింగు చేస్తున్నారు. సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, తదితర సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. మొత్తం పింఛన్ల పంపిణీకి ఈ సిబ్బంది చాలకపోతే ... ఇతర శాఖలకు చెందిన మండల స్థాయి అధికారుల సేవలూ వినియోగించుకోవాల్సి వస్తుంది. ఈ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలని స్పష్టం చేశారు.

పెరగనున్న పింఛన్ మొత్తం...

నియోజకవర్గంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్ జెండర్లు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారులు, డప్పు కళాకారులు, కళాకారుల పింఛన్లను రూ.3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచారు. దివ్యాంగుల పింఛన్లను రూ.3 వేల నుంచి రూ. 6 వేలకు, వైద్య పర అవసరాల కోసం రూ. 3 వేలు, రూ. 5 వేలుగా ఉన్న వాటిని రూ. 10 వేలకు, రూ. 10 వేలుగా ఉన్న మొత్తాన్ని రూ. 15 వేలకు పెంచారు. దీనికోసం మొత్తం రూ. 27.28 కోట్లు అవసరం అవుతుంది. ఈ మొత్తాన్ని శనివారం బ్యాంకు నుంచి విత్ డ్రా చేశారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవోలు తెలిపారు. పెరిగిన మొత్తం, ఎరియర్స్‌తో కలిపి జులై 1న ఇవ్వనున్నట్లు చెప్పారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించిన శివరామయ్య

క్రోసూరు: క్రోసూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న పెండ్యాల శివరామయ్య శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానిక షాదీఖానాలో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో టీకేవీ రమణ మాట్లాడుతూ శివరామయ్య అత్యంత బాధ్యతగా విధులు నిర్వహించారని అన్నారు. ఆయన డ్యూటీలో ఉంటే పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ఉత్సాహం పెరుగుతుందన్నారు. శివరామయ్య దంపతులను పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వై.రాజగోపాల్, ఎస్ఐ ఎం.షఫీ, సత్తెనపల్లి ఎంపీడీవో, అచ్చంపేట, పెదకూరపాడు, అమరావతి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఈవోపీఆర్డీ పి.శివరామయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు

అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలకు వినతి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు కోరారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ బాధ్యులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో 1939లో స్థాపించిన ఆశ్రమానికి దాతలు ఇచ్చిన స్థలంలోని కొంత భాగాన్ని ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు 48 సెంట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఆశ్రమ బాధ్యులపై పదేపదే దాడులకు పాల్పడుతూ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఆశ్రమ నిర్వహణ చేస్తున్న మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ వృద్ధురాలు కావడంతో ఆస్తులను ఆక్రమించాలని కొందరు రౌడీలు పదే పదే ప్రయత్నిస్తున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఆశ్రమ ఆస్తులను పరిరక్షిస్తామని, సమగ్ర విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వేద పాఠశాల విద్యార్థులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు.

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తులు



వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తులు సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, మహమ్మద్ గౌస్

సత్తెనపల్లి: పట్టణంలోని సబ్‌జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ శనివారం సందర్శించారు. ఖైదీలకు అందించే ఆహారం, స్టోర్ రూమ్‌లో సరకు నిల్వలు వంటి వాటిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఖైదీలతో న్యాయసేవల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.వెంకట రత్నం, న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సబ్ జైల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కూడా వారు సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారికి పెడుతున్న భోజనం, ఇతర ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బట్లూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

సత్తెనపల్లి మండలంలోని బట్లూరు గ్రామంలో ఆలోకం వెంకాయమ్మ ద్వితీయ సంస్మరణ మహోత్సవం సందర్భంగా ఈ నెల 30న ఉదయం 9 - మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ శిబిరానికి విశిష్ట అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, అతిథిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రత్యేక అతిథులుగా స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా అగ్నిమాపక అధికారి కాపు సత్యనారాయణ తదితరులు హాజరవుతారన్నారు. వివిధ రుగ్మతలతో బాధపడేవారు ఉచిత శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అతిసార నివారణకు సత్వరచర్యలు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ మణికంఠ

నకరికల్లు: అతిసార వ్యాధి ప్రబలకుండా ముందస్తు నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ డి.జయమణి సూచించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖల అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డి.జయమణి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించి అతిసార బాధితులను గుర్తించి పీహెచ్‌సీకి సమాచారం అందజేయడంతోపాటు వైద్యుల సూచనల మేరకు తగిన మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఐదేళ్ల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అతిసార మరణాలు అరికట్టాలని అన్నారు. నకరికల్లు, కుంకలగుంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మణికంఠ, డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జులై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీవరకు అతిసార నివారణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న నీలకంఠేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది

రాజుపాలెం : విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందిస్తే అనారోగ్యం బారిన పడకుండా కాపాడవచ్చని జిల్లా స్టాటికల్ అధికారి నీలకంఠేశ్వరరావు సూచించారు. మండలంలోని నెమలిపురి -2 సచివాలయం పరిధిలోని దేవరంపాడు యూపీ పాఠశాలలోని శనివారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా స్టాటికల్ అధికారి నీలకంఠేశ్వరరావు, డీపీఓ ఒన్నూరు బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలోని 15 మంది బాలికలకు, గ్రామంలో ఫీల్డ్‌లెవల్‌లో 24 మంది గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. సేకరించిన వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. వ్యాధి నిరోధక టీకా సేవలపై ఆరా తీసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు తేజస్విని, ఉషారాణి, మహిళా కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మాచర్ల: పల్నాడు జిల్లాలో జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు సహకారంతో అన్వర్ బాషా ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఏర్పాట్లను శ్రీనివాస మహల్ థియేటర్ యజమాని జానీ పర్యవేక్షిస్తున్నారు. శనివారం క్రికెట్ పోటీలు బంగ్లా గ్రౌండ్‌లో నిర్వహించారు. నిర్వాహకులతోపాటు క్రికెట్ అభిమానులు పెద్దసంఖ్యలో ఆటను తిలకించారు.

మెగా లోక్ అదాలత్‌లో 58 కేసులు పరిష్కారం

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మురళీ గంగాధరరావు మాట్లాడుతూ... మొత్తం 58 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రూ. 87,01,581 నగదును కక్షిదారులకు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ బి. అచ్చారావు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి

మాచర్ల రూరల్ : ప్రమాదవశాత్తూ నీటిలో పడి గొర్రెల కాపరి చనిపోయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తాళ్ళపల్లి గ్రామ సమీపంలోని సూరమ్మ చెరువులో గడ్డం శ్రీనివాసరావు (40) గొర్రెలను కడుగుతూ ప్రమాదవశాత్తూ జారి లోతైన కుంటలో పడి మరణించాడు. శ్రీనివాసరావు బెల్లంకొండ మండలం, వన్నయ్యపాలెం గ్రామానికి చెందినవాడు. పది నెలల క్రితం కొప్పునూరు గ్రామంలోని అత్తగారింటికి వచ్చి జీవాలు మేపుకుంటూ ఇక్కడే ఉంటున్నాడు. శ్రీనివాసరావుకు భార్య, పిల్లలున్నారు. ఈ మేరకు విజయపురి సౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పట్టణంలోని సమస్యలను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

మాచర్ల: పట్టణంలోని 18వ వార్డులో అధ్వానంగా మారిన పరిసరాలను పురపాలక సంఘం ఏఈ చంద్రశేఖర్, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి షేక్ షాహినాలు శనివారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. బోరు మరమ్మతులు, మంచినీటి సదుపాయాలు, వీధి దీపాల ఏర్పాటు, కాల్వల్లో పేరుకు పోయిన మురుగు తదితర అంశాలను అధికారులు తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డయేరియా పెరుగుతున్నందున ముందస్తుగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీరి వెంట కంభంపాటి అనిల్‌కుమార్, దుర్గారావు, స్థానికులు ఉన్నారు.

మార్కెట్‌లోకి మెటా డీఏపీ



కారెంపూడి : సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మేలైన దిగుబడులు సాధించవచ్చని స్థానిక గ్రోమోర్ సెంటర్ ఏఎంఎం జాకీర్ పేర్కొన్నారు. గ్రోమోర్ సెంటర్‌లో శనివారం మెటా డీఏపీ, గ్రోవైట్ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఒప్పిచర్ల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పి. రవి చేతుల మీదగా నూతన ఉత్పత్తులను ఆవిష్కరించి, రైతులకు పంపిణీ చేశారు. సేంద్రియ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు గ్రోమోర్ చేస్తున్న కృషిని ఏఎంఎం జాకీర్ రైతులకు వివరించారు. భూసారాన్ని పెంచుకునేందుకు రైతులు శ్రద్ధ చూపాలని కోరారు. సేంద్రియ ఎరువులు వాడకాన్ని పెంచుతూ భూమిలో పోషకాల సమతుల్యతను కాపాడుకోవాలని సూచించారు.

అంతర పంట.. లాభమేనంట!

- వేరుశనగ, పత్తి చుట్టూ రక్షణకు అవసరం
- తెగుళ్ల నివారణకు ఎంతో ఉపయుక్తం



దొండేటి పాపకుమారి - ఏవో, దాచేపల్లి



సాగులో ఉన్న పిల్లిపెసర పంట

దాచేపల్లి: వాణిజ్య పంటల సాగులో అంతర పంటలను పండించటం అన్నదాతకు లాభసాటిగా ఉంటుంది. వాణిజ్య పంటలపైనే ఆధారపడకుండా ఉండొచ్చు. అంతర పంటతో భూసారం పెరిగి తెగుళ్ల బెడద తగ్గుతుంది. వర్షం ఆధారంగా ఒక ట్రెండు పంటలను నమ్ముకోవటం కంటే పంట మధ్యలో చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలకు చెందిన అంతర పంటలను సాగు చేయటం మెట్ట వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు సిద్ధమతుతున్నారు. అంతర పంటలు కూడా సాగు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాపకుమారి సూచించారు.

జాగ్రత్తలు ఇలా..

తేలికపాటి నేలల్లో వాలుకు అడ్డంగా దుక్కి దున్నిన తర్వాత విత్తుకుంటే నేలలో తేమశాతం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. వర్షాధారంగా అంతర పంటలు తప్పనిసరిగా వేయాలి. ఆరుతడి పంటలకు బోదే లేదా సాళ్లు లేదా ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవాలి. ఒకవేళ ఎక్కువ వర్షాలు వచ్చినా నీటిని బయటకు పంపడానికి అవకాశం ఉంటుంది. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టడానికి వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర విత్తనాలను తెగుళ్ల మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. పొలంగట్లపై కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దగ్గరగా ఒత్తుగా లేకుండా ప్రతి పంటలోనూ మొక్కల సాంద్రత పాటించాలి.

విత్తనాలు కీలకం...

వేరుశనగ సాగు చేసే రైతులు పొలాన్ని రెండు లేదా మూడుసార్లు దుక్కి చేసుకోవాలి. జులై మాసం అంతా విత్తుకునేందుకు అనుకూలం. కే-6, కే-9, కదిరి హరితాంధ్ర లాంటి విత్తన రకాలు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 నుంచి 60 కిలోల విత్తనాలు అవసరం. విత్తే ముందు కిలో విత్తనానికి ఒక మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేసిన తరువాత గ్రాము టిబుకొనజోల్, 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి పాటించాలి. పొలం చుట్టూ రక్షణ పంటలుగా సజ్జ, జొన్న నాలుగు నుంచి ఆరు వరుసలుగా విత్తుకుంటే కాండంకుళ్లు వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసం పీల్చు పురుగులు, తామర పురుగులను నివారించవచ్చు. 7:1 లేదా 11:1 లేదా 15:1 నిష్పత్తిలో వేరుశనగలో కంది లేదా సజ్జ పంటలు వేసుకోవాలి. విత్తే సమయం లేదా విత్తిన తర్వాత 20 నుంచి 30 రోజుల సమయంలో నీటి సంరక్షణ కోసం ప్రతి 3.6 మీటర్లకు ఒక తల్లిచాలు ఏర్పాటు చేసుకోవాలి.

- కంది రైతులు తేలికపాటి నేల్లో మధ్యస్థ రకాలైన పీఆర్‌జీ-176, పీఆర్‌జీ-158 విత్తనాలు ఎంచుకోవాలి. బరువు నేలల్లో ఎక్కువ కాల పరిమితి రకాలైన ఎల్ఆర్‌జీ-41, ఎల్ఆర్‌జీ-52, ఎల్ఆర్‌జీ-105, టీఆర్‌జీ-59, ఐసీపీఎల్-85063, ఐసీపీఎల్-87119, బీఎస్ఎంఆర్-786 రకాలు ఎంపిక చేసుకోవాలి.
- పత్తి సాగు విషయంలో ఎర్ర నేలల్లో జూన్ నుంచి జూలై వరకు విత్తుకొవచ్చును. నల్లరేగడి నేలల్లో జూలై నుంచి ఆగస్టు వరకు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. ఒక ప్రాంతంలో ఉన్న రైతులంతా దఫాలుగా కాకుండా వీలైతే స్వల్పకాల వ్యవధిలో ఒకేసారి విత్తుకుంటే తెగుళ్లు, చీడపీడల నివారణ సులభమవుతుంది. బీటీ రకం విత్తనాలు ఎకరాకు 750 గ్రాములు నుంచి ఒక కిలో అవసరం. బీటీ రకం వేసుకుంటే పొలం చుట్టూ నాన్‌బీటీ పత్తి లేదా కంది పంట సాగు చేస్తే కాయ తొలుచు పురుగు ఉద్ధృతిని అరికట్టవచ్చు. విత్తుకున్న 40 రోజులకు తప్పనిసరిగా ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా వేసిన ప్రాంతాల్లో పత్తి పంట ప్రస్తుతం మొలక దశలో ఉంటుంది. ఈ వాతావరణానికి వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉన్నందున 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి మొక్క వేరు మండలం తడిసేలా పోయాలి. ఈ సమస్య నివారణకు విత్తే సమయంలో కిలో విత్తనాలకు 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి చేయాలి.
- వరి నారు మడులు పెంచుకునేందుకు జూన్ మాసం అనుకూలం. సాంబమసూరి, నంద్యాల సన్నాలు, నెల్లూరు సోనా, నెల్లూరు మసూరి, నంద్యాల సోనా, ఎంటీయూ-1212, ఎంటీయూ-1280, ఎంటీయూ-1281 లాంటి రకాలు బాగుంటాయి. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు నారుపోసే ముందు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేయాలి.